పక్కా రోడ్డుకు మోక్షమెప్పుడో ?

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

లాలాపేట: దాదాపుగా 30 కుటుంబాలు నివాసం ఉంటున్న వారికి నేటికి పక్కారోడ్డు లేదు. అరకొర సౌకర్యాలు, పక్కా ఇళ్లుసైతం నిర్మించుకోలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 20 ఏళ్లు నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వాలు మారినా.. వీరి పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన గత పదేళ్లలోనూ వీరి సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

◆ రాష్ట్రంలో రెండో పర్యాయం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనైనా కాలనీ రూపురేఖలు మారుతాయని కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు. దాదాపు 4 దశాబ్దాల నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట ఇందిరానగర్ – బి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏ ప్రభుత్వమూ.. పట్టించుకోవడం లేదు..

ఇందిరానగర్– బి కాలనీవాసులు నివసిస్తున్న స్థలం రాష్ట్ర ప్రభుత్వానిది. వారు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు కేంద్ర ప్రభుత్వ రైల్వేకు సంబంధించింది. కాగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోకపోడంతో నేటికి ఇందిరానగర్– బి కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి గతంలో బండారు దత్తాత్రేయ కేంద్రంలో రైల్వేశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర పర్యాటక మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అయినా పట్టించుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలనీకి పక్కా రోడ్డు వేయించాకే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడగాలనీ ఇందిరానగర్ వాసులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



ఇందిరానగర్– బి కాలనీలో మట్టిరోడ్డు ఇలా..



రోడ్డెక్కిన ఇందిరానగర్– బి కాలనీవాసులు

'రోడ్డు నిర్మించే ఓట్ల కోసం రావాలి'..

ఏళ్ల తరబడి పక్కా రోడ్డు లేకుండా ఇబ్బందులు పడుతున్నా ఏ నాయకుడు పట్టించుకోవడం లేదని ఇందిరానగర్– బి కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లకోసం వచ్చేవారు తమకు పక్కా రోడ్డు నిర్మాణం చేస్తామంటేనే ఓట్లు వేస్తామని లేదంటే వేసేది లేదంటున్నారు.

వర్షాకాలంలో బురద..



కాలనీలోని మట్టి రోడ్డు వల్ల వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్మురేగుతుంది. ఈ మట్టిరోడ్డు గుండా రాకపోకలు సాగించలేకపోతున్నాము. ఏదైనా ఎమర్జెన్సీ వాహనాలు రావాలంటే కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి కాలనీలో పక్కా రోడ్డు నిర్మించాలి.

– శారద, ఇందిరానగర్ బి కాలనీవాసి

ఓట్ల కోసమేనా..



ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఓట్ల కోసమే నాయకులు వస్తున్నారు. గెలిచి గద్దెనెక్కాక గెలిచిన వారు, ఓడినవారు సైతం ఎవరూ ఇటువైపు చూడటం లేదు. తామంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. ఓట్లు వేయించుకుంటున్నారు.. తమ బాధలు పట్టించుకోవడం లేదు.

– నాగలక్ష్మి, స్థానికురాలు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ రూ.18, పొడుగు వంకాయ రూ.18, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర రూ.50, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.23, దొండకాయ రూ.21, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు రూ.35, గోకరకాయ రూ.45, కీర రూ.18, దోసకాయ రూ.23, బీట్‌రూట్ రూ.15, ఉల్లిగడ్డ రూ.24, ఆలుగడ్డ రూ.23, చామగడ్డ రూ.67, మొరంగడ్డ రూ.28, కందగడ్డ 55, సొరకాయ రూ.9, పొట్లకాయ 15, అరటికాయ రూ.9, మునగకాయ రూ.4–6, ముల్లంగి రూ.4–6 గా ఉన్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అభినందనల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ నేత నర్సింగరావు

సనత్‌నగర్: బీజేపీ సికింద్రాబాద్–మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన శ్యామ్‌సుందర్‌గౌడ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. బీజేపీ సీనియర్ నేత లింగంపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో పలువురు నేతలు ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఆకుల మహేష్, సుమన్‌కుమార్, కుషల్‌కుమార్, శివప్రసాద్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

'బీసీలకు మొండిచేయి'



జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ సలహాదారుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మొండిచేయి చూపిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా 55 శాతానికి పైగా ఉన్న బీసీలను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కార్యాలయంలో ఒక్క బీసీకి చోటు లభించలేదని, హైకోర్టు అడ్వకేట్ జనరల్, అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్‌లతో పాటు ఇతర నియామకాల్లో సైతం సామాజిక న్యాయాన్ని పాటించలేదని ఆరోపించారు. బీసీలకు తగిన వాటా దక్కకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వ్యర్థాలను తొలగించండి



కనకదుర్గ దేవాలయం ఆవరణలో ఇలా..

బౌద్ధనగర్: డివిజన్‌లోని కనకదుర్గ దేవాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వ్యర్థాల కారణంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రాకపోకలు సాగిస్తున్న పాదచారులు సైతం ఇబ్బంది పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత సిబ్బంది వెంటనే వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు



రోడ్డు మధ్యలో ఇలా..

బౌద్ధనగర్: రోడ్ల మధ్యలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపులు తొలగించడం ద్వారా రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని బౌద్ధనగర్‌వాసులు వాపోతున్నారు. డివిజన్‌లో సుమారు 50 వరకు చేతి పంపులు ఉన్నాయని, వాటిని వాడకపోవడంతోనే నిరుపయోగంగా మారుతున్నాయని వాపోతున్నారు. మరిన్ని బస్తీల్లో రోడ్ల మధ్యలోనే చేతి పంపులు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. నిరుపయోగంగా ఉన్న వాటిని వెంటనే తొలగించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

బాలరాముని ప్రతిష్ఠ.. ఇంటింటా పండుగ



ప్రమిదలను అందజేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

ప్రత్యక్ష ప్రసారానికి ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

సనత్‌నగర్: అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పండుగలా నిర్వహించుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. సోమవారం ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ క్రతువును ప్రత్యక్షంగా తిలకించేలా పలుచోట్ల ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో ఉదయం 7.30 గంటలకు స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకం, అలంకరణ హారతి, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భజన కార్యక్రమాలు, అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అయోధ్యలో జరిగే రాములవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కూడా చేయనున్నట్లు ప్రకటించారు. సాయంత్రం 6 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, జ్యోతిప్రజ్వలన దీపోత్సవం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

లైవ్ ఏర్పాట్లు పూర్తిచేశాం: మర్రి శశిధర్‌రెడ్డి

శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు లైవ్‌లో వీక్షించేలా బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. సోమవారం మధ్యాహ్నం 12.20 నుంచి 12.32 వరకు ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని సామూహికంగా వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యకర్తలు సహకరించాలని కోరారు. సాయంత్రం ఇళ్ల గుమ్మాల వద్ద ఐదు ప్రమిదలను వెలిగించాలన్నారు. అనంతరం సుజుక్ థెరపీ సెంటర్‌కు చెందిన జిజ్ఞేష్ గోకాని ఆధ్వర్యంలో ఆవుపేడతో తయారుచేయించిన ప్రమిదలను అందజేశారు.

నేతాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



హకీమ్ నవీద్

ఉస్మానియా యూనివర్సిటీ: 23న జరిగే స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్‌నవీద్ ఆదివారం డిమాండ్ చేశారు. ఇతర నేతల జయంతులు, వర్ధంతిలను అధికారికంగా నిర్వహిస్తున్న రాష్ట్రప్రభుత్వం దేశ భక్తుడైన నేతాజీ జయంతిని అధికారికంగా నిర్వహించక పోవడం సరికాదన్నారు. ఏఐఎస్‌బీ విద్యార్థి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా నేతాజీ జయంతిని నిర్వహించాలని పిలుపునిచ్చారు.

రెజ్లింగ్‌లో సందీప్‌యాదవ్‌కు రజతం



సన్మానిస్తున్న వ్యాయామశాల నిర్వాహకులు

అమీర్‌పేట: నగరంలో జరిగిన శివ మార్కండేయ కేసరి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు హాజరైన బల్కంపేటకు చెందిన సందీప్‌యాదవ్ రజతం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను వీరహనుమాన్ వ్యాయామశాల నిర్వాహకులు ఆదివారం ఘనంగా సన్మానించి అభినందించారు. గుడి మల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో 76 కిలోల విభాగంలో మెడల్ లభించిందన్నారు. వ్యాయామశాల నిర్వాహకులు రాజేశ్వరరాజు, ధన, తరుణ్, విజయ్, చిన్ను, సోను, సూర్య తదితరులున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి జేఏసీ నాయకుల ఐక్యతతోనే తెలంగాణ ఉద్యమకారులకు అవకాశాలు లభిస్తాయని ఓయూ జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేత అన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్‌హాల్‌లో జరిగే చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్‌వెంకటస్వామి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గిరిబాబు, వెంకటేష్, రాము, సతీష్ తదితరులున్నారు.

ఆలయాల ముస్తాబు



రసూల్‌పురా: అయోధ్యలో నేడు జరిగే శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కంటోన్మెంట్‌లోని పలు రామ, హనుమాన్ ఆలయాలను అందమైన పూలతో రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఆలయాలతో పాటు ప్రధానకూడళ్లు కాషాయమయంగా మారాయి. శ్రీరాముడి చిత్రాలతో కూడిన జెండాలు, కటౌట్లు తోరణాలతో ముస్తాబయ్యాయి. రసూల్‌పురా, అన్నానగర్, బొల్లారం, జగదీష్‌నగర్, కార్ఖానా, తిరుమలగిరి ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో అభిషేకాలు, విశేషపూజలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రజలు వీక్షించేందుకు బీజేపీ నాయకులు భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు.

గంగపుత్రుల ఐక్యతే సమాజ ప్రగతి



సమావేశంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ వారాసీగూడ గంగపుత్ర సంఘం వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య వార్షిక సమావేశం ఆదివారం రాచమల్ల కృష్ణమూర్తి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగపుత్రులు ఐక్యంగా ఉండి సమాజ ప్రగతి సాధించాలన్నారు. సంఘం ప్రతినిధులు పేద, మధ్యతరగతి కులస్తులకు చేయూతనందించాలని సూచించారు. గంగపుత్రుల సమస్యలు పరిష్కరించేందుకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. గడిచిన ఏడాదిలో సాధించిన ప్రగతి నివేదికను సభ్యులకు వివరించారు. గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చంద్రగిరి ఎల్లయ్య, కార్యదర్శి మూట గణేష్, సంఘం ప్రతినిధులు మనోజ్‌కుమార్, యాదగిరి, శ్యామ్, రజినీకాంత్, నాగరాజు, గిరిధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



తుకారాంగేట్ వద్ద కాగడాల ప్రదర్శనలో సీపీఐ నేతలు

అడ్డగుట్ట: విప్లవ పోరాట యోదుడు కామ్రేడ్ లేనిన్ పోరాట స్ఫూర్తితో కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. లేనిన్ శతవర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో తుకారాంగేట్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మనిషిని మనిషి దోచుకుని సమాజాన్ని రష్యాలో గత రాజరిక వ్యవస్థ జార్ చక్రవర్తిని లేనిన్ నాయకత్వపు పోరాటంతో ఓడించి సోవియట్ రష్యాలో సమ సమాజాన్ని స్థాపించిన ఘనత లేనిన్‌కే చెల్లుతుందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే దేశంలో 1925లో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగ స్ఫూర్తితోనే యువత సబ్బండ వర్గాలు భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. కామ్రేడ్ పోరాట స్ఫూర్తితో భారత కమ్యూనిస్ట్ ఆధ్వర్యంలో పోరాటాలు చేయడమే అసలైన నివాళి అని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, పాకాల యాదగిరి, గౌరీ నాగరాజు, రంజిత్ సింగ్, శ్రీహరి, హుస్సేన్, ఖాసిం, రామస్వామి, అనిల్, ఖాజా తదితరులున్నారు.

అలరించిన గుజరాతీ ఏక్తా మహోత్సవ్



రాంగోపాల్‌పేట్: గుజరాతీ ఎక్తా మహోత్సవ్–24లో భాగంగా ఆదివారం రాత్రి గుజరాతీస్కూల్‌లో తెలంగాణ గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎనీబడీ కెన్ డ్యాన్స్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నా, పెద్దా తేడాలేకుండా వివిధ అంశాల్లో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రామ్‌యాత్ర పేరుతో నిర్వహించిన స్కిట్ ఆద్యంతం అందరినీ అబ్బురపరిచింది. రాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయుడి రూపాల్లో ప్రదర్శించిన ఈ నాటిక చిన్నారుల అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. సమాజ్ అధ్యక్షులు పరిమల్ పరేఖ్, ఉపాధ్యక్షుడు చందులాల్ పటేల్, మన్సుఖ్ పటేల్, ప్రధాన కార్యదర్శి మినాల్ వఖారియా, కోశాధికారి కృష్ణకాంత్ పరీఖ్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

భయాందోళనలో స్థానికులు



బౌద్ధనగర్‌లో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

బౌద్ధనగర్: కంచెలేని ట్రాన్స్‌పార్మర్లతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు. దీంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాన్స్‌పార్మర్లకు విద్యుత్‌తీగలు సైతం బయటకు వేలాడుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. రక్షణకంచెలు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇదే తరహాలో కొనసాగితే తరచూ ప్రమాదాల భారీన పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన కరెంట్ ఫ్యూజ్ బాక్సులను కూడా తొలగిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.



వందేళ్ల వృద్ధుడికి విజయవంతంగా శస్త్రచికిత్స



అమీర్‌పేట: ఇంట్లో జారి పడటంతో మెదడులో తీవ్ర రక్తస్రావమై ఆసుపత్రికి వచ్చిన వందేళ్ల వృద్ధుడికి ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు సకాలంలో శస్త్రచికిత్స చేసి వారం రోజుల్లో తిరిగి ఇంటికి పంపించారు. నగరానికి చెందిన 100 ఏళ్ల వృద్ధుడు ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. మెదడులో రక్తస్రావమై అపస్మారకస్థితిలోకి చేరిన అతడిని కుటుంబసభ్యులు అమీర్‌పేట ఆస్టర్‌ప్రైమ్ ఆసుపత్రికి తీసుకొచ్చారని న్యూరో సర్జన్ వై.మురళి కృష్ణ తెలిపారు. వైద్యభాషలో (సబ్డ్యూరల్ హెమటోమా) ప్రాణాంతకమైన మెదడుకు కలిగిన గాయాన్ని 24 గంటల వ్యవధిలో రెండు రకాల శస్త్ర చికిత్సలు చేశామన్నారు. వారం రోజుల అనంతరం పూర్తి ఆరోగ్యవంతంగా ఉన్న రోగిని ఆదివారం డిస్చార్జ్ చేసి ఇంటికి పంపామన్నారు. వందేళ్ల పైబడి ఉండటం, అవయవాల బలహీనత, అపస్మారక స్థితిలో ఉన్న సమయంలో శస్త్రచికిత్సలు చేయడం అంత సులువుకాదన్నారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యబృందాన్ని ఆసుపత్రి రీజినల్ సీఈఓ దేవానంద్ అభినందించారు.

తాగునీటి లీకేజీపై చర్యలు తీసుకోవాలి



పద్మారావునగర్ ప్రధాన రహదారిలో తాగునీటి లీకేజీ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి లీకేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. రోడ్లు, వీధుల్లో తాగునీరు వృథాగా పోతోంది. కిలోమీటర్ల నుంచి పైపులైన్ ద్వారా తాగునీటిని తీసుకొచ్చి ప్రజలకు అందిస్తున్నారు. అయితే జలమండలి సిబ్బంది నిర్లక్ష్యం...బాధ్యతారాహిత్యం కారణంగా నీరు వృథా అవుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీటి లీకేజీలను కనిపెట్టి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోయిగూడ, శ్రీనివాస్‌నగర్, హుస్సేన్‌సాగర్ పంప్‌హౌస్ జలమండలి సెక్షన్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి లీకేజీలు దర్శనమిస్తున్నాయి.

◆ పద్మారావునగర్ ప్రధాన రహదారి లక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదుట చౌరస్తాలో లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. జలమండలి అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలు ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 35 ఏళ్లున్న వ్యక్తి పట్టాలు దాటేందుకు యత్నించాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతుడి వివరాలకోసం ఆరా తీయగా.. లభించలేదు. మృతుడి ఒంటిపై లేత ఆకుపచ్చ రంగు చొక్కా, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయని మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లడ్డూల పంపిణీ

సనత్‌నగర్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా 'బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య', వెల్లాల మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం లడ్డూలను పంపిణీ చేశారు. సనత్‌నగర్ స్వామిటాకీస్ వద్ద జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో 2000 మందికి లడ్డూలను పంచిపెట్టారు. శ్రీరాముడు జన్మించిన ప్రదేశంలో స్వామివారి ప్రాణప్రతిష్ఠ జరగడంపై దేశ ప్రజలందరూ పండుగగా నిర్వహించుకునే సందర్భమన్నారు. దేశం మొత్తం శతాబ్దాలుగా వేచిచూస్తున్న ఈ క్రతువుకు ప్రజలందరూ ఉప్పొంగిపోతున్నారన్నారు. సనత్‌నగర్‌లో పంపిణీ చేశామని, సోమ వారం ఎస్ఆర్‌నగర్‌లో మరో 2000 మందికి లడ్డూలను అందజేస్తామన్నారు.



